# విగ్రహాల విధ్వంసం

## ఇస్లామా?

మౌలానా వహీదుద్దీన్ ఖాన్

**Bamyan Incident - Talibaan Attitude**
**(Telugu)**

# విగ్రహాల విధ్వంశం ఇస్లామా?

మూలం:
మౌలానా వహీదుద్దీన్ ఖాన్

అనువాదం:
ఎం.డి. ఆఖిల్ అలి

This book is aTelugu translation of some chapters from the book "Hindo-Pak dairy", written by Moulana Wahiduddin Khan.

Telugu Translation by: Md Akhil Ali.
Mobile: 98488 20154, Mail:infoakhil1970@gmail.com

**First published in Urdu:2006**

**First published in Telugu: 2024**

**This book is copyright free**

**CPS International,**
Centre for Peace and Spirituality International,
1, Nizamuddin west market, New Delhi-110013, INDIA,
e-mail:info@cpsglobal.org www.cpsglobal.org

**Goodword Books:**
A-21, Sector 4, Noida-201301, Delhi, NCR, India,
e-mail:info@goodwordbooks.com www.Goodwordbooks.com

**Center for Peace and Spirituality USA**
2665, Byberry Road, Bensalem, PA 19020, USA,
e-mail:kkaleemuddin@gmail.com

**Goodword Books - Chennai**
324, Triplicane High Road, Chennai-600005, India,
e-mail:chennaigoodword@gmail.com
Mobile: +91 97908 53944 / +91 96001 05558

**Satyamarga Sandesa Sangham - A.P**
What's app: 93940 03049 / 95735 22690
Website:http: / / cpstelugu.com

# విషయ సూచిక

1. ఇస్లామును కించపరిచే తాలిబాన్ల చర్యలు........................................................01

2. ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కోణాలు................................................06

# విగ్రహ విధ్వంశం ఇస్లామా?

## (ఇస్లామ్ను కించపరిచే తాలిబాన్ల చర్యలు)

రష్యా కమ్యూనిస్టుపార్టీ ఆధిపత్యంలో ఉన్న ఆఖరి దినాల్లో నేను అఫ్ఘనిస్తాన్లో పర్యటించాను. ఆ పర్యటన సందర్భంగా అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబుల్ పూర్తిస్థాయిలో సురక్షితంగా ఉండటాన్ని నేను చూసాను. కాని తాలిబాన్ల వాదన ప్రకారం, వారి ఇస్లామియా పరిపాలనా కాలంలో కాబుల్ యొక్క ఒక పెద్దభాగం చిన్నాభిన్నం అయిపోయింది. అఫ్ఘనిస్తాన్ ప్రజలు ఇప్పుడు ఏ కష్టనష్టాల పరిస్థితులకు గురయ్యారో, అటువంటి పరిస్థితులు వారు తమ దేశ పూర్తిచరిత్రలో ఎన్నడూ ఎరుగరు.

తాలిబాన్లు రష్యాకమ్యూనిజాన్ని కుఫ్ర్(ధర్మధిక్కారం)గా పరిగణిస్తూ, తమకుతాము ఇస్లాం ప్రతినిధులుగా నిర్ణయించుకుంటారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రష్యా "కుఫ్ర్" అయితే అఫ్ఘనిస్తాన్ కు కేవలం పాక్షికంగా నష్టం కలిగిస్తే, తాలిబాన్ల "ఇస్లాం" మాత్రం ఆ దేశాన్ని సర్వనాశనం చేసేసింది. ఇదంతా ఇస్లాం పేరుతోనే కొనసాగుతుంది. కాని ఇలా చేయటం ఇస్లాం పేరుతో ఇస్లామ్ను తిరస్కరించటమే(de-Islamisation)అవుతుంది. ఇలాంటి ఉపమానం, యావత్ ఇస్లామియా చరిత్రలో ఎక్కడా మనకు కనబడదంటే అతిశయోక్తి కాదు.

అయితే ఈ తాలిబాన్లు ఎవరంటే, ఆవేశపూరితమైన మరియు శిక్షణా రహితమైన యువకుల ఒక కోపోద్రేక సమూహం. ఇటువంటి వ్యక్తులు ఎప్పుడైతే ఏదైనా ఒక దేశపు పరిపాలనా పగ్గాలను చేపడతారో, అప్పుడు వారు కేవలం విధ్వంసకర కార్యాలనే చేపడతారు. వీరివలన ఎటువంటి నిర్మాణాత్మక కార్యాలను కూడా ఆశించలేము. ఇలాంటివారు ఎల్లప్పుడూ, “ఏ జాతినైతే ఒక కాకి(Crow)నాయకత్వం వహిస్తుందో, ఆ జాతి గతి అధోగతి” అనే ఒక అరబి కవిత్వానికి ఉదాహరణగా ఉంటారు(అంటే, గ్రుడ్డివాడు మార్గం చూపటం వంటిదని అర్థం).

కాబట్టే, తాలిబాన్లు ఎప్పుడైతే అఫ్ఘనిస్తాన్లో రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకున్నారో అప్పటి నుండి వారు కేవలం ప్రతికూల కార్యాలనే చేసారుగాని, అనుకూల కార్యాలను దాదాపు చేపట్టలేదు. తాలిబాన్ల స్వయం కల్పిత ఈ ఇస్లామియా సంపుటి యొక్క చీకటి చిట్టాలో ఒక అత్యంత విచారకరమైన ఘటన మార్చ్ 1వ

తేది 2001న ఉనికిలోనికి వచ్చింది. అఫ్ఘాని తాలిబాన్లు తమ మతనాయకుడైన ముల్లా ముహమ్మద్ ఉమర్ ఆదేశం మేరకు దేశంలోని గౌతమబుద్ధుని చర మరియు స్థిర విగ్రహాల(statues)ను విస్ఫోటనా పదార్థాలతోనూ మరియు బుల్డోజర్లతోనూ పడగొట్టటం ప్రారంభించారు. ఇంకా వారు, ఇస్లామియా ప్రబోధనల ప్రకారమే తాము ఈ చర్యలకు పాల్పడుతూ గర్విస్తున్నామని అంటున్నారు. ఎందుకంటే, ఇస్లాం విగ్రహారాధనను అంగీకరించదు కాబట్టి. వాస్తవానికి వీరి ఈ చర్య ఇస్లామేతర చర్య. ఇస్లాం విగ్రహారాధనకు వ్యతిరేకమే. కాని, విగ్రహాలను ఆరాధించటంలో మరియు విగ్రహాలను ధ్వంశం చేయటంలో చాలా వ్యత్యాసం ఉంది. ఖురాన్లో అయితే విగ్రహాలను ఆరాధించకండని ఉందిగాని, విగ్రహాలను ధ్వంశం చేయండని మాత్రం లేదు. హృదయాల నుండి విగ్రహాలను తొలగించాలి గాని, రాళ్ళతో చేసిన విగ్రహాలను ధ్వంశం చేయటం మాత్రం ఇస్లాం విధానం కాదు.

ఈ వ్యతాసాన్ని అర్థం చేసుకోవటానికి కొన్ని ఉదాహరణలను చూడండి. ఖురాన్లో, "ఓ ముస్లింలారా! మీరు నమాజ్ను ఆచరించండి" అని ఆజ్ఞాపించటం జరిగిందితప్పా, "నమాజ్ చదవని వారిని హతమార్చేయండి" అని ఆజ్ఞాపించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి నమాజుకు సంబంధించిన ఈ ఖురాన్ ఆజ్ఞను తీసుకొని, నమాజు చేయని వారిని చంపుకుంటూపోతే అది ఖురాన్ ప్రబోధన ఎంతమాత్రం కాదు సరికదా ఖురాన్ పై తిరుగుబాటు అవుతుంది. ఇంకొక ఉదాహరణ ఏమిటంటే, ధనవంతులు దైవగృహమైన కాబాను దర్శించి హజ్ చేయండని ఖురాన్ ఆజ్ఞాపిస్తుంది. ఒకవేళ వారు ధనం ఉన్నప్పటికీ హజ్ చేయకపోతే వారిని బంధించి వారి కాళ్ళూచేతులను విరగ్గొట్టటం చేస్తే, అది, ఖురాన్ పేరుతో ఒక స్వయం కల్పిత పాపపు కార్యమే అవుతుందిగాని పుణ్యకార్యం మాత్రం కాజాలదు.

విగ్రహారాధన వ్యవహారం కూడా ఇంతే. ఒక ముస్లిం వ్యక్తికి ఖచ్చితంగా ఉన్న హక్కు ఏమిటంటే, అతడు ఎంతో సౌమ్యంగా మరియు కారుణ్యపు పద్ధతిలో విగ్రహారాధనా విధానాన్ని విడిచిపెట్టటానికి శాంతి యుతంగా ప్రచారం చేసుకోవచ్చు. అంతేగాని ఇస్లాం పేరుతో విగ్రహాలను ధ్వంశంచేసే హక్కు ఏ ఒక్క ముస్లింకు కూడా లేదు. మొదటి విధానం ఇస్లాం అనుశరణ అయితే, రెండవ విధానం ఇస్లాంపై తిరుగుబాటు మరియు శతృత్వం అవుతుంది.

అయితే ఇక్కడొక ప్రశ్న ఏమిటంటే, మక్కా విజయం తరువాత కాబా గృహంలో పెట్టబడిన విగ్రహాలను ఎందుకు ధ్వంశం చేయటం జరిగింది? అనేది. వాస్తవం ఏమిటంటే, కాబాను అబ్రాహాము మరియు ఇష్మాయేలు వీరిద్దరూ ఏకేశ్వరోపాసన కోసం నిర్మించారు. ఒక సుధీర్ఘ కాలం వరకు ఈ కాబా తన నిర్మాణ

లక్ష్యం ప్రకారం ఏకేశ్వరోపాసనపైనే స్థిరంగా ఉండేది. ఆ తరువాత అక్కడ కొందరు దైవేతరారాధకులు జన్మించారు. వారిలో ఒకడు అమర్ బిన్ లుఖీ, క్రీ.శ.570కు పూర్వం కాబాను ఆక్రమించుకొని అసమంజస రీతిలో 360 విగ్రహాలను కాబాలో ప్రతిష్టించటం ప్రారంభించాడు. ఈ విగ్రహాలు, మక్కా విజయం(క్రీ.శ.10/01/630 సంవత్సరం)వరకు కాబాలోనే ఉన్నాయి. ఋషీశ్వరుడైన ముహమ్మద్ ముందుగా మక్కాలో దైవేతరారాధనకు వ్యతిరేకంగా ప్రచారం చేసారు. ఆ తరువాత ఎప్పుడైతే యావత్ మక్కావాసులు ఇస్లాం ధర్మాన్ని స్వీకరించగా ఇస్లాం అనుయాయులకు మక్కాపై విజయం లభించిందో, అప్పుడు, ఋషీశ్వరుని ఆజ్ఞ మేరకు, దౌర్జన్యపూరితంగా కాబాలో పెట్టబడిన ఆయా విగ్రహాలను అక్కడ నుండి తొలగించటం జరిగిందంతే.

దీని వెలుగులో చూసినట్లైతే, తెలిసే విషయం ఏమిటంటే, కాబాలో పెట్టబడిన విగ్రహాల విషయంలో వ్యవహరించిన తీరు విగ్రహాల ధ్వంశం ఎంతమాత్రం కాదుగాని, అదొక శుద్ధి కర్యక్రమం మాత్రమే. ఈవిధంగా చేయటానికి కారణమేమిటంటే, కాబాను దైవేతరారాధకుల అన్యాయపు ఆక్రమణ నుండి విముక్తి కలిగించి, తిరిగి దానిని ఏకేశ్వరోపాసనా సిద్ధాంతంపై పునహ్ స్థాపన చేయటం మాత్రమే.

ఇదేవిధంగా ఖురాన్లో చెప్పబడిన మరో విషయమేమిటంటే, అబ్రహాము, తన కాలంలో కొన్ని విగ్రహాలను ధ్వంశం చేసారు(21:59)అనేది. కాని ఈ ఘటనద్వారా కూడా, ప్రపంచంలోఅన్నిచోట్ల ఉన్న విగ్రహాలను పడగొట్టండనే ఆజ్ఞ  ముస్లింలకు ఇవ్వబడటంలేదు. అబ్రహామువారి ఈ వ్యవహారం ఒక అసాధరణమైన (మినహాయింపు)వ్యవహారం మాత్రమే. ఏవిధంగానైతే తన కుమారుణ్ణి బలి ఇవ్వటానికి సిద్ధపడిపోయారో, తన భార్యను మరియు పసిపిల్లవాణ్ణి కూడా నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టేయటం జరిగిందో అటువంటిది ఈ విగ్రహాల విధ్వంశపు వ్యవహారం కూడా. అబ్రహామువారి ఈ వ్యవహారం అతని వ్యక్తిగత వ్యవహారమేగాని, ఇది సర్వమానవులు అనుసరించవలసిన వ్యవహారం మాత్రం కాదు.

ఋషీశ్వరుడైన అబ్రహాము కొన్ని విగ్రహాలను ధ్వంశం చేయటమే ఒకవేళ సార్వత్రిక ఆజ్ఞయే అయివుంటే, అప్పుడు దీనికి సంబంధించిన ఆజ్ఞ ప్రతీ ఋషీశ్వరుని జీవితంలో కూడా మనం చూసి ఉండేవాళ్ళం. వాస్తవానికి ఇటువంటి ఒక్కగానిఒక్క ఉదాహరణకూడా ఏ ఋషీశ్వరుని జీవితంలోనూ మనకు లభించదు. అబ్రహాము కూడా కేవలం ఒక విగ్రహాలయంలోని కొన్ని విగ్రహాలను మాత్రమే పడగొట్టారుతప్పా, ఆ ప్రాంతంలోని అన్ని ఆలయాల్లోని అన్ని విగ్రహాలను  పడగొట్టలేదు. వాస్తవం ఏమిటంటే, అబ్రహామువారి ఈ సంఘటన సామాన్య అర్ధంలో విగ్రహాల విధ్వంశపు వ్యవహారం కాదు. అదొక సుధీర్ఘ సందేశ

సంఘర్షణా సంపూర్ణతకు సంబంధించిన సత్యనిరూపణ(ఇత్మామే హుజ్జత్)పై ఆధారితమైన ఒక ప్రత్యేక (మినహాయింపు)వ్యవహారం మాత్రమే. దీనినే ఖురాన్ గ్రంథంలో **కైదేఅస్నాం**(21:57)అని చెప్పటం జరిగిందేగాని **కస్రెఅస్నాం** అని మాత్రం చెప్పబడలేదు(అంటే, అబ్రాహాము విగ్రహాలను పడగొట్టింది, దానిద్వారా అక్కడివారికి జ్ఞానోదయం కలిగించటానికేగాని, వాస్తవానికి వాటిని ధ్వంశం చేయటం అతని ఉద్దేశ్యం ఎంతమాత్రం కాదు). ఇది అబ్రహాము వ్యక్తిగత సందేశ వ్యూహమేగాని, యావత్ ముస్లిం ప్రపంచం, లేక ఏకేశ్వరోపాసకులు ఆచరణాత్మకంగా అనుసరించవలసిన ఆదర్శం ఎంతమాత్రం కాదు.

చరిత్ర చాటిచెప్పే విషయమేమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్ తరువాత అతని సహచరులు మరియు వారి సహచరులు అరబ్బు నుండి బయలుదేరి చుట్టుప్రక్కల ఉన్న వివిధ దేశాల్లో వ్యాపించి, పెద్ద ఎత్తున ఇస్లాంధర్మ ప్రచారం చేపట్టారు. చివరికి అనేక దేశాలు ఇస్లామియా రాజ్యాలుగా మారిపోయాయి. కాని ప్రవక్త సహచరులుగాని లేక వారి సహచరులు(తాబయీన్)గాని ఏదేశంలోకూడా ఎటువంటి విగ్రహాలను లేక చిత్రపటాలను ధ్వంశం చేసే చేష్టలను చేపట్టలేదు. వారి లక్ష్యం కేవలం హృదయాల్లో ఉన్న విగ్రహాలను తొలగించటమే తప్పా, బయటకు కనబడే విగ్రహాలను ధ్వంశం చేయటం కాదు. దీనికి సంబంధించి ఒక ఉదాహరణ ఏమిటంటే, ఇస్లాం ప్రారంభకాలపు ముస్లింలు ఈజిప్టు దేశంలో ప్రవేశించారు. వారు అక్కడ శాంతియుత సందేశం ద్వారా ప్రజల విశ్వాసాన్ని మార్చారు తప్పా, అక్కడున్న ప్రాచీన విగ్రహాలను ఎన్నడూ ధ్వంశం చేయలేదు. వాటిలోనే ఒక ప్రముఖ విగ్రహం అబుల్ హౌల్. ఈ విగ్రహం ఇప్పటికీ కైరో పట్టణానికి బయట ఒక పెద్ద బండరాయిపై స్థాపితమై సుస్థిరంగా ఉంది. నేను స్వయంగా ఈ విగ్రహాన్ని ఒక ప్రయాణం సందర్భంగా చూసాను.

అయితే ఈవిషయంలో ఇప్పుడు అఫ్ఘనిస్తాన్ చరిత్రను చూద్దాం. అఫ్ఘాన్ల ఉల్లేఖనం ప్రకారం, వారి దేశంలో ఇస్లాం మొదటిసారిగా రుషీశ్వరుడైన ముహమ్మద్ కాలంలో చివరిదశలోనే ప్రవేశించేసింది. ఆ తరువాత ముహమ్మద్ సహచరుడైన ఖాలిద్ బిన్ వలీద్ మరియు ఇతర ముస్లింలు అఫ్ఘనిస్తాన్లో ప్రవేశించారు.

ఆ కాలంలో బౌద్ధమతస్తులు అధిక సంఖ్యలో ఉండేవారు. వారిలోని చాలామంది ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. అక్కడ ఇస్లాంధర్మ ప్రచారం శాంతియుతంగా కొనసాగింది. చివరికి, మెహ్మూద్ గజ్నవి కాలంలో యావత్ అఫ్ఘనిస్తాన్లో ఇస్లాం వ్యాపించేసింది.

ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్ కాలంలోనే ఇస్లాం అఫ్ఘనిస్తాన్లో ఎప్పుడైతే ప్రవేశించిందో, అప్పటికి సుమారు ఐదు వందల సంవత్సరాలకు పూర్వమే ప్రతిచోట గౌతమ

బుద్ధుని విగ్రహాలు రాతికొండల్లో చెక్కబడి సుస్థిరం చేయబడ్డాయి. ఇస్లాంకుపూర్వమే అక్కడ బౌద్ధమతాన్ని అనుసరించే ప్రజలు నివశించేవారని చెప్పబడుతుంది. ఆ తరువాత వారిలోని అధికులు ఇస్లామ్ను స్వీకరించారు. బుద్ధుని ఈ రాతిశిల్పాలే ఇస్లాముకు పూర్వపు జ్ఞాపక చిహ్నాలు.

అఫ్ఘనిస్తాన్ పర్వతాల్లో స్థాపించబడిన ఈ రాతిశిల్పాలు ఏవిధంగానైతే ఇస్లాంకు పూర్వం వేల సంవత్సరాల నుండి సురక్షితంగా ఉన్నాయో, అదేవిధంగా ఇస్లాం తరువాత కూడా వేయి సంవత్సరాలకన్నా ఎక్కువ కాలం వరకు ఇప్పటికీ సురక్షితంగానే ఉన్నాయి. చివరికి అపఖ్యాతి పాలైన సుల్తాన్ మెహ్మూద్ గజ్నవి కూడా అఫ్ఘనిస్తాన్లోని ఈ విగ్రహాలను ధ్వంశం చేయలేదు. ఏ రాతిశిల్పాలను లేక విగ్రహాలను ఇస్లామేతర విషయాలుగా నిర్ణయించి ధ్వంశం చేయటం జరుగుతుందో అది, కేవలం ఆధునిక ఇస్లామియా కాలంలోని తాలిబాన్ల స్వయం కల్పిత విషయం మాత్రమే. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, తాలిబాన్లు ఇస్లామియా ప్రబోధనల జ్ఞానాన్ని సంపూర్ణంగా కలిగి ఉన్నారా? అనేది. ఏ ఇస్లామియా ప్రబోధనలైతే రుషీశ్వరుడైన ముహమ్మద్ సహచరులకుగాని వారి సహచరులకుగాని లేక ఆ సహచరుల సహచరులకు గాని లేక కనీసం ఆ తరువాతి ఇస్లాం అనుయాయులకుగాని లేదో, ఆ జ్ఞానం ఈ తాలబాన్లకు ఏవిధంగా దొరికేసిందనేదే ఆ ప్రశ్న.

వాస్తవం ఏమిటంటే, అఫ్ఘనిస్తాన్లోని తాలబాన్లు విగ్రహాల విధ్వంశం పేరుతో ఏదైతే చేస్తున్నారో అది, కార్యాచరణ పరంగానైతే ఇస్లామ్ను అనుమానస్పదం చేయటంలో ఒకభాగం. ఇలాంటి చర్యలు కేవలం ఇస్లామ్ను బద్నాం చేస్తాయితప్పా, వీటివలన ఇస్లాంకు ఏమాత్రం లాభంలేదు.

మార్చ్ 14, 2001లో రాయల్ ఖండ్ విశ్వవిద్యాలయం(బరెలి)లో నా ప్రసంగం ఒకటి జరిగింది. ఆ ప్రసంగం యొక్క అంశం: "ఇస్లాం మరియు శాంతి". ప్రసంగం అనంతరం ఏ ప్రశ్నలైతే వచ్చాయో, వాటిలో ఒక ప్రశ్న అఫ్ఘనిస్తాన్ తాలిబాన్ల ప్రస్తుత కార్యాచరణకు సంబంధించింది. నేను ఆ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఈవిధంగా చెప్పాను:"ఇస్లామియా రాజ్యంలో రెండవ ఖలీఫా అయిన ఉమర్, రుషీశ్వరుడైన ముహమ్మద్కు ఒక గొప్ప ప్రియశిష్యుడనే విషయం మీకు తెలిసిందే. అతని కాలంలోనే సిరియా, పాలస్తీన మరియు ఈజిప్టు వంటి అనేక దేశాలు ఇస్లాం పరిధిలోనికి వచ్చేసాయి. ఇస్లాంకు పూర్వం నుండే ఆయా దేశాల్లో అనేక విగ్రహాలు ఉండేవి. ఈ విగ్రహాలను ధ్వంశం చేసేయండని ఉమర్ వారు ఏనాడూ ఫత్వా(తీర్పు)ను జారీచేయలేదనటానికి చరిత్రే సాక్ష్యం. కాని ఈనాడు తాలిబాన్ల మత నాయకుడైన ముల్లా ఉమర్ మాత్రం అతిప్రాచీన బుద్ధుని విగ్రహాలను ధ్వంశం చేసేయండని హుకుం జారీ

చేస్తున్నాడు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, ఇస్లాం యొక్క నిజమైన ప్రతినిధి ఎవరు? అనేది: "ఇస్లాం ప్రారంభపు కాలంలోని ఖలిఫా అయిన ఉమరా? లేక ప్రస్తుత కాలంలోని అఫ్ఘనిస్తాన్కు చెందిన ముల్లా ఉమరా?అనేది.

## ఈ వ్యవహారానికి సంబంధించిన కొన్ని కోణాలు

ఇస్లాం వివిధ మతాల మధ్య మతసహన సిద్ధాంతాన్ని అంగీకరిస్తుంది. రుషీశ్వరుని మక్కా కాలంలో ఈ వాక్యం ఖురాన్లో అవతరించింది: "మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే"(109:6)అని. ఈ ఇస్లామియా సిద్ధాంతాన్ని గనుక ఒక ఫార్ములా(సూత్రం)గా తీసుకుంటే, అప్పుడు ఈవిధంగా చెప్పవచ్చు:"ఒక దానిని అనుసరించండి, మిగిలిన వాటిని గౌరవించండి". (Follow one and respect all)

2. ఇస్లామియా సూత్రానికి సంబంధించిన ఈ ఆచరణాత్మక ఉదాహరణలు, యావత్ ఇస్లామియా చరిత్రలో మనకు కనబడతాయి. ఉదాహరణకు, ఇస్లామియా రాజ్యానికి రెండవ ఖలీఫా అయిన ఉమర్ ఫరూఖ్ కాలంలో పాలస్తీనాపై విజయం లభించింది. ఆ సందర్భంగా ఇస్లామియా ఖలీఫా మరియు పాలస్తీనా క్రైస్తవుల మధ్యన ఒక ఒప్పందం జరిగింది. ఆ ఒప్పంద పత్రంలో, వివిధ అంశాలతోపాటు క్రైస్తవుల చర్చీలు మరియు ఆ చర్చీలలో ఉండే యేసు మరియమ్మల విగ్రహాలు అలాగే శిలువ వంటివాటిని యథాతథంగా ఉండనివ్వాలనేది కూడ ఒక షరతు. దానిని ఉమర్ అంగీకరించారు. మతసహనం అనే ఈ సూత్రంపైనే యావత్ ఇస్లామియా చరిత్ర కొనసాగుతూ ఉంది. గత శతాబ్దాల్లో ఇస్లాం అసాధారణ రీతిలో ప్రచారం జరగటానికి కారణం ఇదే. కొన్ని సందర్భాల్లో కొందరు ముస్లిం రాజులు కొన్ని విగ్రహాలను ధ్వంశం చేసిన విషయమైతే వాస్తవమే. అయితే అవి, ఆయా రాజుల రాజకీయ ప్రయోజనాలకు సంబంధించిన మినహాయింపు దుర్ఘటనలే తప్పా, వీటితో ఇస్లాంకు ఏమాత్రం సంబంధంలేదు.

3. అఫ్ఘనిస్తాన్లో, పర్వతాలను తొలచి గౌతమబుద్ధుని ఏ రాతి విగ్రహాలైతే స్థాపించబడ్డాయో అవి, ప్రారంభంలో ఏ స్థాయి(status)ని కలిగివున్నప్పటికీ, రెండువేల సంవత్సరాల సుదీర్ఘ కాలం తరువాత వాటి స్థితి(status)మాత్రం చారిత్రక జ్ఞాపకం(వారసత్వ సంపద)గా మారిపోయింది. అవి ఇప్పుడు ఏదో ఒక ప్రత్యేకవర్గపు యాజమాన్యంలో కాకుండా సార్వజనీన యాజమాన్యంలోనికి వచ్చేశాయి. ఇప్పుడవి మానవాళి ఉమ్మడి ఆస్తిగా మారిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇస్లామియా సూత్రం ఏమిటంటే,

వాటిని వ్యక్తిగత లేక జాతీయ పరిధినుండి బయటకుతీసి, అంతర్జాతీయ పరిధికి చెందినవిగా ప్రకటించటమే.

ఉదాహరణకు జెరూషలెంకు చెందిన అఖ్సా మసీదునే తీసుకోండి. ఈ మసీదుకు వారసులము మేమే అని ముస్లింలు వాదిస్తున్నారు. ఈ వాదనకు తార్కిక మూలం కూడా ఇదే. మనందరికి తెలిసిన విషయం ఏమిటంటే, ఎక్కడైతే ఇస్రాయేలీయుల ప్రవక్త అయిన దావీదు కుమారుడైన సొలోమాను యూదుల ప్రార్ధనా మందిరాన్ని(హైకల్)ను కట్టించారో, ఆ ప్రాంతంలోనే అఖ్సా మసీదును నిర్మించటం జరిగింది. బనుఉమయ్యా కాలంలో ఇదే ప్రాంతంలో ఇప్పుడున్న అఖ్సా మసీదును కూడా నిర్మించటం జరిగింది.

ఈ వ్యవహారపు వాస్తవికత ఏమిటంటే -ముస్లింల విశ్వాసం ప్రకారం- రుషీశ్వరుడైన ముహమ్మద్ తన రుషీశ్వరత్వపు 13వ యేట(క్రీ.శ.621), సర్వేశ్వరుని ప్రత్యేక ఏర్పాటుద్వారా మక్కా నుండి జెరూషలెంకు ప్రయాణం చేసారు. ఆ సర్వేశ్వరుని అనంత మహత్తు ప్రకారం, చరిత్రలోని యావత్ సందేశహరులను అక్కడ హాజరుపరచటం జరిగింది. ఆ రుషీశ్వరులందరు కూడా అంతిమ రుషీశ్వరుని నాయకత్వంలో సామూహిక ప్రార్ధనను నిర్వహించారు. ముస్లింల నమ్మకం ప్రకారం, ఆ తరువాత ఈ ప్రాంతం కేవలం యూదులకే కాకుండా సమస్త మతాల వారికి కూడా పవిత్ర ప్రాంగణంగా -ఇస్లాం కారణంగా- సర్వసాధారణం అయిపోయింది. ముస్లింలు తమ ఈ విశ్వాస ప్రాతిపదికన జెరూషలెంలోని అఖ్సా మసీదుకు హక్కుదారులు అవుతారు. ఒకవేళ ఈ సూత్రాన్ని గనుక ఒప్పుకోకపోతే అప్పుడు అఖ్సా మసీదు మరియు దాని చుట్టుప్రక్కల భూభాగం కేవలం యూదుల యాజమాన్యంలోనే ఉంటుంది తప్పా, ముస్లింలకు ఏమాత్రం భాగం ఉండదు.

వాటి వాస్తవికత ఆధారంగా చూసినట్లైతే, ఇదే విషయం అఫ్ఘనిస్తాన్లోని ప్రాచీనకాలంలో అక్కడి పర్వతాల్లో తొలచబడిన బౌద్ధవిగ్రహాలకు వర్తిస్తుంది. రెండువేల సంవత్సరాలకు పూర్వం ఎప్పుడైతే అవి తొలచబడ్డాయో, అప్పుడవి అఫ్ఘనిస్తాన్ జాతీయ సంపదగా పరిగణింపబడవచ్చు. కాని ఒక సుధీర్ఘ చరిత్ర గడచిపోయిన తరువాత అవి అంతర్జాతీయ సంపదగా పరిగణింపబడతాయి. ఇప్పుడా విగ్రహాలు మానవ చరిత్రలో ఒక భాగమేతప్పా, ఏదోఒక దేశానికి చెందిన పరిమితమైన జాతీయ సంపదలో కొంత భాగం ఎంతమాత్రం కావు.

అయితే ఇప్పుడు అఫ్ఘనిస్తాన్లోని ఏ ప్రభుత్వానికైనా సరే, అంతర్జాతీయ సోదరభావాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఆ విగ్రహాల విషయంలో దానంతటదే ఏకపక్ష నిర్ణయం తీసుకునే హక్కు ఎంతమాత్రం లేదు. అఫ్ఘనిస్తాలోని

ఏదైనా ఒక ప్రభుత్వానికి ఒకవేళ ఏదైనా హక్కు ఉందంటే అది, మహా అయితే ఒక ప్రకటన చేసుకునే హక్కు మాత్రమే ఉంది. ఆ ప్రకటనా హక్కు ఏమిటంటే, "కావాలనుకుంటే ఏ దేశమైనాసరే ఈ విగ్రహాలను త్రవ్వి తమ దేశానికి తీసుకుపోవచ్చు" అని ప్రకటించటం తప్పా, వాటిని ఎంతమాత్రం ధ్వంశంచేసే హక్కు ఏ ప్రభుత్వానికికూడా లేదు. తాలిబాన్ల ప్రభుత్వం ఈ విగ్రహాలను విక్రయించనూలేదు. ఎందుకంటే, వీరి విశ్వాసం ప్రకారం, ఏ విగ్రహాలైతే తమ దేశంలో ఉండటం ధర్మసమ్మతం కాదని వారు భావిస్తున్నారో, ఆ విగ్రహాలను విక్రయించటం కూడా నిస్సందేహంగా ధర్మసమ్మతం కాజాలదు.

4. ఇస్లాం బోధించే ఒక హితబోధ ఏమిటంటే, "ముస్లింలు, తమకు తిరిగి చేదు పరిణామాలు కలిగించే ఏ చర్యను కూడా చేపట్టకూడదు" అనేది. ఉదాహరణకు ఖురాన్లోని ఈ వాక్యాన్ని చూడండి:"ఆ సర్వేశ్వరుణ్ణి విడిచిపెట్టి వారు ఎవరినైతే ఆరాధిస్తున్నారో వారిని మీరు దూషించకండి. ఎందుకంటే వారు అజ్ఞానం కారణంగా మీ నిజదైవాన్ని దూషించే అవకాశం ఉంది"(5:109)అని. దీనినిబట్టి తెలిసేదేమిటంటే, ముస్లింల దృష్టిలో ఒకవేళ ఏదైనా ఒకపని సమంజసమే అయినప్పటికీ, దాని పరిణామాలు వారికి వ్యతిరేకంగా గనుక వస్తున్నట్లైతే ఆ పనిని ఎంతమాత్రం చేపట్టకూడదు అనేది అర్థమౌతుంది.

ఈ ఖురాన్ సూత్రాన్నిబట్టి చూస్తే, తెలిసే విషయం ఏమిటంటే, తాలిబాన్లు ఇప్పుడు చేపట్టిన ఈ విగ్రహాల విధ్వంశం నేరుగా ఖురాన్ ప్రబోధనలకు పూర్తి వ్యతిరేకం అనేది. ఎందుకంటే, ఒక ముస్లిం దేశం ఒకవేళ తన పరిధిలోవున్న చారిత్రక చిహ్నాలను ఛిద్రం చేసినట్లైతే అప్పుడు ఇతర జాతుల భావోద్వేగాలు ప్రభావితమై స్వయంగా వారుకూడా తమతమ దేశాల్లోని ముస్లింల చారిత్రక చిహ్నాలను ఛిద్రం చేస్తారు. ఈవిధంగా ముస్లింల కార్యాచరణ, స్వయంగా ముస్లింలకే భరించరాని భయంకరమైన నష్టానికి కారణభూతం అవుతుంది.

ఇప్పుడు నేను చెప్పిన విషయం ఎప్పుడో భవిష్యత్తులో జరిగే పరిణామం కాదు. వాస్తవమేమిటంటే, 2001 మార్చ్ నెల ప్రారంభంలో ఎప్పుడైతే అఫ్ఘనిస్తాన్లోని అతి ప్రాచీనమైన గౌతమబుద్ధుని విగ్రహాలు ధ్వంశం చేయబడుతున్నాయనేవార్త, పత్రికల్లో వచ్చిందో, అప్పుడు యావత్ ప్రపంచంలో తీవ్ర ప్రతిఘటన ప్రారంభమైంది. ఈ ప్రతిఘటనల్లో ఒక ప్రతిఘటనను ఇక్కడ పేర్కొంటున్నాను దయచేసి చూడండి. న్యూఢిల్లీ నుండి వెలువడే పత్రిక టైంస్ ఆఫ్ ఇండియా(2/3/2001)మొదటి పేజీలో ఒక రిపోర్టు, "Cultural Carnage, Screams India" అనే మకుటంతో ప్రచురించబడింది.

ఆ రిపోర్టులో ఒక హిందూవ్యక్తి, అఫ్ఘనిస్తాన్ వార్తలను విశ్లేషిస్తూ, "ఎవరికి ఇష్టమున్నా ఇష్టం లేకపోయినా సరే, ముస్లిమేతర దేశాలు తమ దేశంలోని ముస్లింల చారిత్రక చిహ్నాలను ధ్వంశం చేస్తున్నప్పుడు పరిస్థితి ఏమౌతుంది" అని ప్రశ్నించాడు. (It's not a matter of likes and dislikes. The world cherished it. What would happen if the non-Islamic countries start destroying Islamic architecture?" he questioned).

5. రుషీశ్వరుడైన ముహమ్మద్ జీవితచరిత్ర అధ్యయనం ద్వారా అవగతమౌతున్న విషయమేమిటంటే, ఎప్పుడైతే విజయం లభించిందో అప్పుడు వెంటనే ఆయనగారు సయోధ్యా విధానాన్ని అవలంభించారు అనేది. ఇదే విషయాన్ని ఖురాన్ గ్రంథంలో "సయోధ్య అన్ని విధాలా ఉత్తమమైనది"(4:128)అని చెప్పబడింది. ఈ సయోధ్యలోవున్న జ్ఞానయుక్తమైన విషయమేమిటంటే, విజయం లభించిన తరువాత వెంటనే కావలసింది కేవలం 'అభివృధి' మాత్రమే. ఈ అభివృధి అనేది శాంతియుత వాతావరణంలోతప్పా సాధ్యంకాదు. కాబట్టే, రుషీశ్వరుడైన ముహమ్మద్, మదీనాలో మొదటిదశ ఇస్లామియా రాజ్యస్థాపన జరిగినప్పుడు వెంటనే ఒక ప్రకటనను జారీచేసారు. ఆ ప్రకటన, "మదీనా ప్రకటన"గా ప్రాచుర్యం పొందింది. ఆ ప్రకటనలో ఆయనగారు యూదులకు సమానస్థాయిని ప్రసాదించి, వారితో వివాదపడే విధానాన్ని అంతంచేసే పద్ధతిని అవలంభించారు. ఇదేవిధంగా ఆయనగారు హుదైబియా సందర్భంలో కూడా మక్కా ఖురైషులతో యుద్ధరాహిత్య ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ ఒప్పందం సాధ్యపడిందంటే దానికి కారణం, ప్రవక్తవారు తన ప్రత్యర్ధులు పెట్టిన ప్రతీషరతునూ ఏకపక్షంగా అంగీకరించటమే. ఇదేవిధంగా ఆయనగారు వివిధ అరబ్బు తెగలవారితో శాంతి ఒప్పందాలు చేసుకోవటం ప్రారంభించారు. చివరికి యావత్ అరబ్బుతెగల ప్రజలు కేవలం కొన్నిసంవత్సరాల్లోనే ఈ శాంతిఒప్పందాలు చేసుకున్నారు. ఇంకా మొదలైనవి.

తాలిబాన్లు తమ ప్రకటన ప్రకారం, అఫ్ఘనిస్తాన్లో ఇస్లామియా రాజ్యాన్ని స్థాపించాలని భావించారు. కాని వారి సిద్ధాంతం యావత్తూ ఇస్లాం ప్రవక్త అయిన ముహమ్మద్ సిద్ధాంతానికి పూర్తి వ్యతిరేకమైంది. అఫ్ఘనిస్తాన్ పై ఆధిపత్యం సాధించటానికిగాను వారు స్వయంగా అఫ్ఘాన్ తెగలతో కయ్యానికి కాలుదువ్వారు. ఇక ఎప్పుడైతే వారికి 90శాతం అఫ్ఘాన్ భూభాగంపై ఆధిపత్యం ప్రాప్తమైందో, అప్పుడు వారు, ఎంతటి తీవ్రవాద సిద్ధాంతాన్ని అవలంభించారంటే, దాని కారణంగా యావత్ ప్రపంచ దేశాలు

వారితో ఘర్షించటం ప్రారంభించాయి. వారి ఈ హింసాయుత సిద్ధాంతపు చివరాఖరి ఉదాహరణ, గౌతమబుద్ధుని చారిత్రాత్మక విగ్రహాలను ధ్వంశం చేయటం ద్వారా బయటపడింది.

అఫ్ఘనిస్తాన్ తాలిబాన్ల వద్ద కేవలం ఆవేశం అనే ఆస్తి తప్పా, ఆలోచన అనే ఆస్తి మాత్రం దాదాపుగా లేదు. ఒకవేళ వారు స్పృహలో ఉండే బుద్ధిమంతులే అయితే వారికి అర్థమయ్యే విషయం ఏమిటంటే, ఆధునిక కాలంలో అధికశాతం జాతులు(చాలామంది ప్రజలు)-తప్పుగానో లేక ఒప్పుగానో- ముస్లింలకు ప్రత్యర్థులైపోయారనేది. ఏదోవిధంగా ప్రతిజాతికీ ముస్లింల విషయంలో ఫిర్యాదులు ఉన్నాయి. యూదులు, క్రైస్తవులు, హిందువులు, సిక్కులు, పారశీయులు ఇంకా మొదలైనవారు, ఏదో ఒక కారణంచేత తమ హృదయాల్లో ముస్లింలకు వ్యతిరేకంగా ప్రతికూల భావాలను కలిగి ఉన్నారు.

విద్వేషపూరితమైన ఈ సామూహిక వాతావరణంలో దాదాపు కేవలం ఒకేఒక్క కొనియాడదగ్గ మినహాయింపు మిగిలిపోయింది, అదికూడా బౌద్ధతెగకు సంబంధించింది. అందరికీ సుపరిచితమైన వాస్తవం ఏమిటంటే, బౌద్ధులకు ముస్లింలతో ఏవిధమైన శతృత్వం లేదనేది. కాని ఎప్పుడైతే 2001 మార్చ్ నెలలో బౌద్ధవిగ్రహాలను  నేలమట్టం చేయటం జరిగిందో, అప్పుడు యావత్ ప్రపంచంలోని బౌద్ధులు ముస్లింలను -తత్ కారణంగా ఇస్లామ్ను- ద్వేషించటం ప్రారంభించారు. తాలిబాన్ల ఈ పరలోక చింతనా రాహిత్య సిద్ధాంతం ఇస్లాంకు లేక ముస్లింలకు సానుకూలంగానైతే ఏమీ ఇవ్వలేదు. కాని వారి చేష్టల ప్రతికూల పర్యవసానాలను బహుశా మాటల్లో వెల్లడించటం సాధ్యంకాదు.

6. బుద్ధివంతమైన మరియు సహజసిద్ధమైన ఒక శుపరిచిత సూత్రం ఏమిటంటే, ఇతరులమధ్య మనం స్వయంగా అభాసుపాలయ్యే ఏ కార్యాన్ని కూడా చేపట్టకూడదు అనేది. ఇస్లాం ధర్మం చెప్పేది కూడా ఇదే. కాబట్టే, రుషీశ్వరుడైన ముహమ్మద్ తన కాలంలో అనేక చర్యలను చేపట్టకుండా ఉండటానికి కారణం, ఇస్లాంధర్మం ఎక్కడ అభాసు(బద్నాం)పాలవ్వుదో అనే దూరదృష్టి. ఉదాహరణకు మదీనా నాయకుడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై వంటి నేరస్తులను సహితం ఆయనగారు శిక్షించకుండా వదిలేశారు. ఎందుకంటే, ప్రజల్లో భావోద్వేగాలు రేగకుండా ఉండేందుకు అలాగే ఇస్లాంధర్మం బద్నాం కాకుండా ఉండేందుకు. ఈ సూత్రం వెలుగులో చూసినా తాలిబాన్ల ప్రస్తుత కార్యాచరణా విధానం పూర్తిగా ఇస్లామేతరం. ఎందుకంటే, చారిత్రక చిహ్నాల విషయంలో ఆధునిక ప్రపంచం అత్యంత తీవ్రస్థాయిలో సున్నితం(sensitive)గా మారిపోయింది కాబట్టి. ప్రస్తుత కాలంలోని ప్రజలు చారిత్రక చిహ్నాలను సాధారణ సార్వజనీన వారసత్వంగా భావిస్తున్నారు. ఎవరైతే చారిత్రక చిహ్నాలను పరిరక్షించకపోవటమే కాకుండా వాటిని

ధ్వంశం చేయటానికి కంకణబద్ధులైపోతారో, అటువంటివారిని ఆధునిక మానవుడు అత్యంత తీవ్రస్థాయిలో ద్వేషిస్తాడు.

ఆధునిక కాలంలో చారిత్రక చిహ్నాల విషయంలో ప్రజల సున్నితత్వం యొక్క ఒక ప్రత్యేక జ్ఞానపరమైన కారణం ఉంది. వాస్తవం ఏమిటంటే, ఈ శాస్త్రీయ కాలానికి ముందు ప్రాచీన కాలంలో ఏదైనా ఒక విషయాన్ని నిరూపించటానికి ఒక ఉపమానాన్ని ప్రవేశపెడితే సరిపోయేది. ఏదైనా ఒక విషయాన్ని నిరూపించటానికి ఒక కల్పితగాధను లేక రహస్యకథను చెప్పటం సమంజసమైనదిగా భావించేవారు. ప్రాచీనకాలంలో స్వకల్పిత సిద్ధాంతాల మరియు సామూహిక సిద్ధాంతాల మధ్యన వ్యత్యాసాన్ని చూసే సాంప్రదాయం ఉండేదికాదు.

కాని ఆధునిక యుగంలో శాస్త్రీయ ఆలోచనా విధానం ఈ విషయాన్ని ఆద్యాంతం మార్చేసింది. ఇప్పుడు ఉపమానాలు లేక కల్పిత కథలనేవి జ్ఞానపరంగా అప్రమాణికంగా పరిగణింపబడుతున్నాయి. ఇప్పుడు ఏదైనా ఒక విషయాన్ని నమ్మాలంటే, అది తన వాస్తవ ఉనికిని కలిగి ఉండాలి. ఇలాంటి ఆధునిక భావజాలం కారణంగా బాహ్యపరమైన చారిత్రక సాక్ష్యాల ప్రాధాన్యత పెద్దస్థాయిలో పెరిగిపోయింది. ఎందుకంటే, చరిత్ర తెలుసుకోవాలంటే, చారిత్రక సాక్ష్యాలే ప్రామాణికమైన మార్గాలుగా భావించ బడుతున్నాయి కాబట్టి. చారిత్రక చిహ్నాలను ఛిద్రం చేయటమంటే, చరిత్ర యొక్క ప్రామాణిక మార్గాలను ఛిద్రం చేయటంతో సమానమని ఈ ఆధునిక ఆలోచనా ప్రపంచం భావిస్తుంది. ఈ కారణంగానే ఈనాటి ప్రజలు చారిత్రక చిహ్నాలను ధ్వంశం చేయటాన్ని సహించే విషయంలో ఏవిధంగానూ సిద్ధంగాలేరు.

ఈ సరిక్రొత్త ధృక్పథమైతే మాత్రం, విశ్వాసాన్ని చరిత్రతో వేరుపరిచేసింది. అందుకే అఫ్ఘనిస్తాన్లో ఈ ప్రాచీన విగ్రహాలను ఇప్పుడు కేవలం మతపరమైన విశ్వాసకోణంలో కాకుండా చారిత్రక సాక్ష్యం అనే సున్నితమైన కోణంలో చూడటం జరుగుతుంది. అఫ్ఘనిస్తాన్లోని ప్రస్తుత ఘటనలపై అంతర్జాతీయ ప్రతిఘటనకు మూలకారణం చరిత్ర అనే ఈ ఆధునిక అభిరుచి మాత్రమే.

ఆధునిక మీడియా అయితే ఈ విషయసున్నితత్వాన్ని మరింతగా పెంచేసింది. అందుకే ఎప్పుడైతే ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం గౌతమబుద్ధుని విగ్రహాలను ధ్వంశం చేయటం మొదలెట్టిందో, ఆ వెనువెంటనే మీడియా ద్వారా దీని వార్తలు యావత్ ప్రపంచంలో వ్యాపించేసాయి. ఖచ్చితంగా అదేరోజు నుండి తాలిబాన్ల ఈ చర్యను తీవ్రంగా ఖండించటం కూడా జరుగుతుంది.

అఫ్ఘాన్ తాలిబాన్లు తమ ఈ చర్యలను ఒకవేళ తమ జాతి లేక తమ వర్గం పేరుతో చేస్తున్నట్లైతే అప్పుడు వాటి ప్రతికూల పర్యవసనాల అపఖ్యాతి స్వయంగా వారిపైగాని లేక వారి వర్గంపైగాని ఉండేది. కాని వారు మాత్రం తమ చర్యలను ఇస్లాం మరియు ఇస్లామియా షరియత్ పేరుతో చేయటం ప్రారంభించటం వలన వాటి చేదు ప్రతిఫలాలు ఇస్లాం అనుభవించవలసి వస్తుంది. ప్రజలు ఇస్లామ్ను తీవ్రంగా విమర్శించటం ప్రారంభించారు. ఇస్లాం ఒకవేళ ఇదే అయితే, అప్పుడది కౄరత్వ మరియు అనాగరిక మతం అని అంటారు. ఈనాటి మతప్రధానమైన సమాజానికి ఇస్లాం పనికిరాని మతం అని కూడా అంటారు.

తాలిబాన్ల బుల్డోజర్లైతే రాతివిగ్రహాలను పడగొడుతున్నాయి. కాని వాటి పర్యవసానం ప్రకారమైతే మాత్రం వారు ఇస్లాం యొక్క ధృక్పథాన్ని పడగొడుతున్నమనే దానికి బాధ్యులౌతారు.

7. న్యూఢిల్లీ నుండి వెలువడే వారపత్రిక ఆర్గనైజర్లో 11 / 03 / 2001న ఒక వ్యాసం ప్రచురితమైంది. దాని సంబంధం అఫ్ఘనిస్తాన్లో గౌతమబుద్ధుని విగ్రహాలను ధ్వంశం చేయటంతో ఉంది. ఆ వ్యాసరచయిత ష్యాంఖోస్లా. ఆ వ్యాసం యొక్క అంశం:"Islaamic Fundamentalism - A Civilizational Threat" (ఇస్లామియా మతతత్వం - ఒక నాగరిక ప్రమాదం)

వ్యాసరచయిత తాలిబాన్ల ఈ చర్యను అనాగరిక చర్య(barbaric act)గా పరిగణించారు. మేము కూడా దీనిని సమర్థిస్తున్నాము. వాస్తవమేమిటంటే, అఫ్ఘానీ తాలిబాన్ల ఈ విధ్వంశకర చర్య ఏ కోణం నుండి చూసినా సమర్థనీయంకాదు. ఈ చర్యను ఎంతగా నిందించినా ఖచ్చితంగా అది సమంజసమే అవుతుంది.

కాని ప్రస్తావిత వ్యాసరచయిత మాత్రం అఫ్ఘానీ తాలిబాన్ల ఈ పాదు చర్యను ఇస్లామియా ప్రబోధనలతో ముడిపెట్టేసారు. ఇతని ఈ రెండవ అభిప్రాయం మాత్రం వాస్తవానికి తప్పుడు అభిప్రాయం. జ్ఞానవంతుడైన ఏ వ్యక్తి అయినా సరే అతనితో ఏకీభవించడు. ష్యాం తన వ్యాసంలో వ్రాస్తూ, "ముల్లా ఉమర్ చెప్పేది ఏమిటంటే, తన ఈ చర్య ఇస్లామియా షరియత్ ప్రకారమే ఉంది" అనేది. ఒకవేళ ఇదే నిజమైతే అప్పుడు, ఇస్లాం(మత)సహనాన్ని ప్రభోదిస్తుందని ఒకవ్యక్తి ఏ ధైర్యంతో చెప్పగలడు? (Mulla Mohammad Umar says his edict is in line with Islamic laws. If that were so, how can anyone in his senses claim that Islam teaches the spirit of tolerance? -(P-4)

ఇస్లాం ప్రబోధనలు ఏమిటని తెలుసుకోవాలంటే, ముల్ల ఉమర్ చెప్పిన మాటలు ఆధారం కాదుగాని ఖురాన్ సున్నత్లే ఆధారమని నేనంటాను. ఏ వ్యక్తైతే ఇస్లామ్ను తెలుసుకోవాలని భావిస్తున్నాడో, అతడు

తప్పకుండా ముస్లింలను మరియు ఇస్లామ్ను వేరువేరుగా చూడాలి. ఏవిధంగానైతే భారతీయ ప్రజాస్వామ్యాన్ని మరియు లాలూ-రబ్రీల రాజకీయ నమూనా మరియు ప్రజాస్వామ్యంలో వ్యత్యాసాన్ని చూస్తున్నామో. ఈ వ్యత్యాసం చేయకుండా ఇటు ఇస్లామ్నూ అర్థం చేసుకోలేము, అటు భారతీయ ప్రజాస్వామ్యాన్నిగాని లేక భారతీయ రాజ్యాంగాన్ని కూడా అర్థం చేసుకోలేము.

ఇస్లామియా ధృక్పథానికి మూలం, కేవలం ఖురాన్ సున్నత్లు(రుషీశ్వరుడైన ముహమ్మద్ సూక్తులు) మాత్రమే. వీటిలో అత్యంత స్పష్టంగా చెప్పబడిన విషయం ఏమిటంటే, అంతర్జాతీయ సంబంధాలను సయోధ్య మరియు శాంతి, అలాగే పరస్పర ఒప్పందాల ప్రాతిపదికన నిర్మించుకోవాలనేది. అంతర్జాతీయ వ్యవహారాల్లో, ఏవిధంగానైతే వివిధ జాతుల మధ్యన పరస్పర అంగీకారంతో ఏ సాంప్రదాయాలైతే (నియమ-నిబంధనలైతే)నిర్ణయించబడతాయో, ఆ సాంప్రదాయాలనే ముస్లింలుకూడా అంగీకరించాలి అనేది ఇస్లాం చూపించే ఒక నిరంతర సూత్రం. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఏకపక్షంగా ఏదైనా ఒక కార్యాచరణ నిర్ణయాన్ని స్వతంత్రంగా తీసుకోవటమనేది ముస్లింలకు సమంజసం కాదు. (మరిన్ని వివరాలకు "Islam Rediscovered" అనే మా మరో పుస్తకాన్ని చూడండి).

ఇక ఇస్లాం చూపించే ప్రామాణిక కార్యాచరణ ఏదైనా ఉందంటే అది, రుషీశ్వరుడైన ముహమ్మద్ ఆచరించి చూపించిన కార్యాచరణ మాత్రమే. అలాగే, ఆయనగారి సహచరులు. మరీముఖ్యంగా ఖుల్ఫా-ఎ-రాషిదీన్(మార్గదర్శక సహచరులు)మాత్రమే. ప్రారంభపు కాలంలోని ఈ ఆదర్శవంతుల తరువాత ఇక ఏ ఇతర ముస్లింకుగాని లేక ముస్లిం వర్గాలకుగాని ఈ ప్రామాణికత అనే స్థాయి లేదు.

శ్రీ ఉమర్ ఫారూఖ్, రుషీశ్వరుడైన ముహమ్మద్ యొక్క ఒక గొప్ప గౌరవప్రద సహచరుడనే విషయం మనందరికి తెలిసిందే. రుషీశ్వరుడైన ముహమ్మద్ తరువాత ఆయనకు రెండవ ఖలీఫా స్థాయి లభించింది. ఉమర్ కాలంలో ఇస్లాం ప్రభావం వివిధ దేశాలకు ప్రాకిపోయింది. ఉదాహరణకు సిరియా, పాలస్తీనా, ఈజిప్తు మొదలైనవి. ఆ కాలంలో యావత్ ప్రపంచంలో విగ్రహారాధనా సాంప్రదాయం సర్వసామాన్యంగా ఉండేది. కాబట్టే, ఆయాదేశాల్లో విగ్రహాలు మరియు చిత్రపటాలు ఇస్లాంకు పూర్వంనుండే అత్యధిక సంఖ్యలో ఉండేవి. అయితే ఖలిఫా ఉమర్, ఆ విగ్రహాలను ధ్వంశం చేయండని ఏనాడూ ఆజ్ఞాపించలేదు. కాని ఈనాడు అఫ్ఘనిస్తాన్లోని ఆ ప్రాచీన గౌతమబుద్ధుని విగ్రహాలను తాలిబాన్ల నాయకుడు ముల్ల ఉమర్ ఆజ్ఞమేరకు ధ్వంశం చేయటాన్ని మనం కళ్ళారా చూస్తున్నాం. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, ఇస్లాం యొక్క నిజమైన ప్రతినిధి ఎవరనేది. ఆనాటి ఖలీఫా ఉమరా? లేక ఈనాటి ముల్లా ఉమరా?

ఈ ప్రస్తావిత తాలిబాన్ల ఖండనార్హమైన చర్య తరువాత, ఈ వ్యాస రచయిత, ఒక సామూహిక పత్రికా ప్రకటనపై సంతకం చేయటం జరిగింది. ఆ ప్రకటన పత్రికల్లో ప్రచురింపబడింది కూడా. ఆ ప్రకటనను ఈ వ్యాసం చివరిలో పొందుపరచటం జరిగింది.

ఎప్పుడైతే అఫ్ఘనిస్తాన్లోని తాలబాన్ల ప్రభుత్వం, చారిత్రాత్మకమైన మరియు మతపరంగా ప్రాధాన్యత కలిగిన గౌతమబుద్ధుని విగ్రహాలను ధ్వంశంచేసే నిర్ణయాన్ని తీసుకుందనే వార్త తెలిసిందో, అప్పుడు అత్యంత బాధ కలిగింది. చారిత్రక చిహ్నాలు యావత్ మానవాళికి సంబంధించిన వారసత్వ సంపదలు. వాటి సంబంధం కేవలం ఏదోఒక ప్రభుత్వంతోగాని, ఒక ప్రాంతంతోగాని లేక ప్రజల ఏదోఒక వర్గంతోగాని ముడిపడిలేదు. మతపరమైన మందిరాలను మరియు ధార్మిక వ్యక్తుల విగ్రహాలను పడగొట్టటమనేది పూర్తిగా ఇస్లామేతర మరియు పనికిమాలిన చర్యగా పరిగణింపబడుతుంది. ముస్లింలు, ముస్లిమేతరుల ఆరాధనాలయాలను గౌరవించాలని ఇస్లాం బోధిస్తుందేతప్పా, వాటిని ధ్వంశం చేయండని మాత్రం ఆజ్ఞాపించటం లేదు. ఒకవేళ అఫ్ఘనిస్తాన్ నుండి వస్తున్న వార్తలు నిజమే గనుక అయితే, మేము వాటిని ఖండిస్తున్నాము. అలాగే, ఇస్లామియా ఆత్మకు పూర్తి వ్యతిరేకమైన ఇటువంటి చర్యలకు దూరంగా ఉండండని కూడా తాలిబాన్ ప్రభుత్వంతో కోరుతున్నాము. “It is unfortunate to learn that Afghanistan’s Taliban Government has decided to demolish statues of historical and religious importance in the country. Historical monuments are heritage of all mankind and do not beling to any government or area or people. Demolition of places of worship and statues of religious personalities is totally un-Islamic and unwarranted. Islam has commanded us to respect places of worship of other religions. Islam does not allow the destruction of religious places of any community. If the news emanating from Afghanistan is correct we condemn this act and ask the Taliban government to desist from any such step which goes against the spirit of Islam”. -(ఇది, మౌలనా వహీదుద్దీన్ ఖాన్ వ్రాసిన పుస్తకం “హిందో - పాక్ డైరి” నుండి సేకరించిన ఒక వ్యాసం. pages.122-134)

**సమాప్తం!**

తాలిబాన్లు, రష్యాకమ్యూనిజాన్ని ఒక కుఫ్ర్(ధర్మధిక్కారం)గా పరిగణిస్తూ, తమకుతాము ఇస్లాం ప్రతినిధులుగా నిర్ణయించు – కున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రష్యా "కుఫ్ర్" అయితే అఫ్ఘనిస్తాన్కు కేవలం పాక్షికంగా మాత్రమే నష్టం కలిగిస్తే, తాలిబాన్ల "ఇస్లాం" మాత్రం ఆ దేశాన్ని సర్వనాశనం చేసేసింది. ఇదంతా ఇస్లాం పేరుతోనే కొనసాగుతుంది. కాని ఇలా చేయటం ఇస్లాం పేరుతో ఇస్లామ్నే తిరస్కరించటం(de-Islamisation) అవుతుంది. ఇలాంటి ఉపమానం, యావత్ ఇస్లామియా చరిత్రలో ఎక్కడా మనకు కనబడదంటే అదిఅతిశయోక్తి కాదు.

అయితే ఈ తాలిబాన్లు ఎవరంటే, ఆవేశపూరితమైన మరియు శిక్షణారహితమైన కొందరు యువకుల ఒక కోపోద్రేక సమూహం. ఇటువంటి వ్యక్తులు ఎప్పుడైతే ఏదైనా ఒక దేశపు పరిపాలనా పగ్గాలను చేపడతారో, అప్పుడు వారు కేవలం విధ్వంశకర కార్యాలనే చేపడతారు. వీరివలన ఎటువంటి నిర్మాణాత్మక కార్యాలనుకూడా మనం ఆశించలేము. ఇలాంటి వారు ఎల్లప్పుడూ, “ఏ జాతినైతే ఒక కాకి(Crow) నాయకత్వం వహిస్తుందో, ఆ జాతి గతి అధోగతి” అనే ఒక అరబి కవిత్వానికి ఉదాహరణగా ఉంటారు (అంటే, గ్రుడ్డివాడు మార్గం చూపటం వంటిదని అర్థం).

https://linktr.ee/maulanawahiduddinkhan

www.cpsglobal.org www.goodwordbooks.com
https://cpstelugu.com https://libraryofpeace.com/